క్లుప్తంగా

ఆస్పరి సీఐగా హనుమంతప్ప

ఆస్పరి: ఆస్పరి సీఐగా హనుమంతప్ప గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఆస్పరి ఎస్‌హెచ్‌ఓ నుంచి యూపీఎస్‌కు మారుస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు ఇచ్చింది. ఈ మేరకు తిరుపతిలో ఎస్‌ఐగా పనిచేస్తున్న హనుమంతప్ప పదోన్నతిపై సీఐగా ఆస్పరికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను ప్రశాంతంగా జరిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. బాధ్యతలు చేపట్టిన సీఐని జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, కేశవరెడ్డి, పెద్దరెడ్డి, శేఖర్‌రెడ్డి, గఫూర్ శాలువా, పూలమాలలతో సన్మానించారు.

ముమ్మరంగా పైప్‌లైన్ పనులు


పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామం ఎస్సీ కాలనీలో ఇంటింటికీ కొళాయి వేసి నీటి సమస్యను పరిష్కరిస్తామని సర్పంచ్ విజయుడు అన్నారు. గురువారం జరుగుతున్న పైప్‌లైన్ పనులను ఆయన పరిశీలించారు. ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని త్వరలోనే పైప్‌లైన్ పనులు కూడా పూర్తి చేసి ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేస్తామని చెప్పారు.

శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప మాలధారులు


శబరిమలైకు బయలుదేరుతున్న అయ్యప్పమాలధారులు

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి, విరుపాపురం గ్రామాల నుంచి 64 మంది అయ్యప్పమాలధారులు గురువారం శబరిమలకు బయలుదేరివెళ్లారు. ముందుగా స్థానిక అయ్యప్ప స్వామి ఆలయాల్లో సామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఇరుముడి కట్టుకొని వాహనాల్లో తరలివెళ్లారు.

నేడు సురక్ష వైద్య శిబిరాలు

ఆలూరు రూరల్: మండలంలో శుక్రవారం స్థానిక సచివాలయం–3 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అల్లబకష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఆ సచివాలయం పరిధిలో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించనున్నట్లు చెప్పారు. శిబిరంలో ముగ్గురు స్పెషలిస్టు డాక్టర్లతో పాటు, ఒక గైనిక్ డాక్టర్, కంటి వైద్య నిపుణులు వైద్య సేవలందిస్తారని చెప్పారు. రోగులు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామ సచివాలయం ఆవరణలో శుక్రవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. గ్రామ ప్రజలందరూ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వాహనం ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు


గాయపడిన చంద్రబాబు

హాలహర్వి: మండలంలోని బాపురం గ్రామానికి చెందిన పి.చంద్రబాబు కర్ణాటక–ఆంధ్ర సరిహద్దులోని చింతకుంట గ్రామ శివారులో గురువారం రాత్రి 10 గంటల సమయంలో బైక్‌పై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో చంద్రబాబు తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గుర్తించి క్షతగాత్రుడిని బళ్లారి ఓపీడీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు చంద్రబాబు కారేకల్ ఫ్యాక్టరీలో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని బైకుపై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయిందని బంధువులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదంపై హాలహర్వి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

బెల్లం ఊట ధ్వంసం

పెద్దకడబూరు: మండల పరిధిలోని హనుమాపురం గ్రామ చుట్టుపక్కల కొండల్లో గురువారం 1500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. హనుమాపురం గ్రామంలో అక్రమంగా నాటుసారా కాస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. అకస్మికంగా స్పెషల్ పార్టీతో వెళ్లి కొండల్లో గాలింపు చేపట్టినట్లు తెలిపారు. అక్కడ లభ్యమైన బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. నాటుసారా కాస్తున్న నలుగురు వ్యక్తులను పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న తరణంలో నాటుసారా, కర్ణాటక మద్యం తరలింపు, అల్లర్లకు పాల్పడేవారిపై నిఘా ఉంచామన్నారు. ఎవరైనా అలాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బ్రిడ్జి నిర్మాణంతో తీరిన కష్టాలు

- రూ.17 లక్షలు వెచ్చించి బ్రిడ్జి నిర్మాణం
- హర్షం వక్తం చేస్తున్న ప్రజలు

ఇది కదా.. అభివృద్ధి


నేడు – లింగాలవాగుపై బ్రిడ్జి నిర్మించిన దృశ్యం


నాడు – భారీ వర్షాలకు వాగు పొంగడంతో వరదనీటిలో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మద్దికెర: మండల పరిధిలోని బసినేపల్లి గ్రామ పరిసరాలలో భారీ వర్షాలు వచ్చాయంటే సమీపంలోని లింగాలవాగు నిండి ప్రవహిస్తుంది. దీంతో గ్రామానికి ఎస్సీ కాలనీకి మధ్యలో ఉన్న రోడ్డుపై నీరు ప్రవహించి కాలనీకి రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో రోజుల తరబడి విద్యార్థులు పాఠశాలలకు, ప్రజలు గ్రామంలోకి అత్యవసర పరిస్థితుల్లోనూ రాలేక ఇబ్బందులు పడేవారు. బ్రిడ్జి నిర్మించాలని గ్రామానికి వచ్చిన ప్రతి నాయకుడిని, అధికారులను బతిమాలిడినా పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న నాథుడు లేడు. 2015 సంవత్సరం సెప్టెంబర్ 26వతేదీన వచ్చిన భారీ వర్షాలకు ఎస్సీ కాలనీవాసులు రోజుల తరబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లారే గానీ బ్రిడ్జి నిర్మించలేదు. ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చి వాగ్దానాలు ఇచ్చిన వారే గానీ బ్రిడ్జి నిర్మించలేకపోయారు. ఎవరిని అడగాలో తెలియక ఎన్ని రోజులు భరించాలో తెలియక అవస్థలు పడ్డారు. 2019లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన కంగాటి శ్రీదేవి గ్రామంలో పర్యటనకు వచ్చినపుడు బ్రిడ్జి నిర్మించాలని కోరడంతో గెలిచిన వెంటనే నిర్మిస్తానని మాట ఇచ్చి రూ.17 లక్షలు మంజూరు చేయించి బ్రిడ్జిని నిర్మించారు. దీంతో వానలు వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు.

గెలిచిన వెంటనే బ్రిడ్జి నిర్మించారు



2019 ఎన్నికల సమయంలో కంగాటి శ్రీదేవి గ్రామానికి వచ్చినప్పుడు ప్రజల ఇబ్బందులు తెలియజేశాం. అప్పుడు ఇచ్చిన హామీ మేరకు ఎన్నికల్లో గెలిచిన వెంటనే నిధులు మంజూరు చేయించి బ్రిడ్జి నిర్మించారు. దీంతో భారీ వర్షాలు వచ్చినా ఇబ్బంది లేకుండా ఎస్సీ కాలనీకి రాకపోకలు సాగించగలుగుతున్నాం. – భద్రయ్య, మార్కెట్‌యార్డు డైరెక్టర్, బసినేపల్లి

ఆందోళన తప్పింది



గతంలో వానలు వచ్చాయంటే చాలు వాగు పొంగడంతో మా కాలనీకి, గ్రామానికి రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో పిల్లలు బడికి వెళ్లేందుకు అవకాశం ఉండేది కాదు. బ్రిడ్జి నిర్మించడంతో ప్రస్తుతం ఎలాంటి సమస్యలు లేవు. వానలు వచ్చినా ఎలాంటి ఆందోళన లేదు. – సుందరయ్య, బసినేపల్లి

పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదు



బ్రిడ్జి నిర్మించాలని గ్రామానికి వచ్చిన ప్రతి ఒక్కరినీ అడిగినా పట్టించుకోలేదు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిని అడిగిన వెంటనే మా ఇబ్బందులు గుర్తించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. గతంలో వానలు వస్తే మా కాలనీ వాసులు పనులకు వెళ్లేందుకు వీలుండేది కాదు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. ఇబ్బందులు తొలగిపోయాయి. – ప్రతాప్, మాజీ సర్పంచ్, బసినేపల్లి

నెట్టికంటుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: మండలకేంద్రానికి సమీపంలోని గుంతకల్లు తాలుకా కసాపురం పుణ్యక్షేత్రంలో కొలువైన నెట్టికంటి ఆంజనేయస్వామిని గురువారం అమావాస్య సందర్భంగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు భజంత్రీలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ నారాయణదాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగడు, జిల్లా సేవాదళ్ ప్రధాన కార్యదర్శి లలితా రామచంద్ర, కోఆప్షన్ సభ్యులు నజీర్, ఆంజనేయులు, ఎంపీటీసీ గద్దల అంజనేయులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామం వైఎస్సార్ సర్కిల్ జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. డీఎస్పీ సీతారామయ్య ఆదేశాల మేరకు గురువారం ఎస్‌ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మట్లాడుతూ.. సరైన వాహన ధ్రువీకరణ పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. అక్రమ మద్యం, నగదు తరలింపును అరికట్టేందుకే తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కేంద్రం కృషి


పగిడిరాయిలో గర్భిణులకు పోషకాహారం అందిస్తున్న కేంద్ర మంత్రి ఎస్‌పీ సింగ్ బఘేల్

తుగ్గలి: దేశంలోని పేద ప్రజల కోసం ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బఘేల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పగిడిరాయిలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఆర్డీఓ రామలక్ష్మి, సర్పంచ్ సౌజన్య, బీజేపీ నాయకులు నీలకంఠ, శ్రీరామ్‌గౌడ్ మంత్రికి ఘన స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన చేసి వందేమాతరం గీతాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్, అటల్ పింఛన్, జన్‌ధన్‌యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్ బీమా యోజన, ముద్ర రుణాలు, ఉజ్వల్ గ్యాస్, ఆవాస్ యోజన తదితర పథకాల గురించి వివరించారు. గతంలో మాదిరిగా అవినీతికి ఆస్కారం లేకుండా కేంద్రం ఇచ్చే సంక్షేమ పథకాల సొమ్ము నేరుగా జన్‌ధన్ ఖాతాల ద్వారా లబ్ధిదారులకు చేరుతుందన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పోస్టర్, క్యాలెండర్ ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్‌గౌడ్ ఇంటికి వెళ్లిన మంత్రి అల్పాహారం తీసుకున్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య, డీఎస్‌ఓ ప్రసాద్, తహసీల్దార్ రవి, ఎంపీడీఓ సావిత్రి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఇరువర్గాల ఘర్షణ



గాయపడిన తెలుగు హనుమంతు, చాకలి నరసన్న

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని సున్నంబట్టీల వద్ద గురువారం సాయంత్రం స్థలం విషయంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగటంతో ఆరుగురికి గాయాలయ్యాయి. సున్నంబట్టీల వద్ద తెలుగు హనుమంతు, చాకలి సంఘం వారికి కొంతకాలంగా స్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. స్థలాన్ని తాము కొనుగోలు చేశామని తెలుగు హనుమంతు కుటుంబ సభ్యులు చెబుతుండగా, తమకు గతంలో ప్రభుత్వం కల్యాణ మండపం కోసం స్థలం ఇచ్చిందని చాకలి సంఘం వారు చెబుతున్నారు. ఇదే విషయమై సాయంత్రం రెండు వర్గాల వారు గొడవకు దిగడంతో ఈ ఘర్షణలో తెలుగు హనుమంతు, రవి, మహనందిలకు గాయాలయ్యాయి. అలాగే చాకలి నరసన్న, రఘు, మరో మహిళకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

ట్యాంకర్‌తో నీటి తడులు


గజ్జహళ్లి సమీపంలో ట్యాంకర్లతో మిరప పైరుకు నీరు పెడుతున్న దృశ్యం

హొళగుంద: వర్షాభావ పరిస్థితులు, తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు నీటి సరఫరా నిలిచిపోవడంతో మండలంలో సాగుచేసిన మిరప పైరు ఎండుతోంది. మండలంలో ఎల్లెల్సీ కింద రైతులు వేలాది ఎకరాల్లో మిరప సాగు చేశారు. వర్షాభావం కారణంగా టీబీ డ్యాంకు ఆశించిన స్థాయిలో నీరు చేరకపోవడంతో డిసెంబర్ 25న టీబీ బోర్డు అధికారులు దిగువ కాలువకు నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో సాగు చేసిన పంటలు నీటి తడులు అందక వాడుముఖం పట్టాయి. ప్రారంభంలో పంట ఏపుగా పెరిగి ఆనందంలో ఉన్న రైతులకు కాలువకు నీటి సరఫరా నిలిచిపోవడంతో దిగాలు మొదలైంది. భూమి మీదే ఆధారపడి వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంట కళ్లెదుటే వాడిపోతుంటే రైతులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఎకరాకు దాదాపు రూ.లక్షకు పైగానే పెట్టుబడి పెట్టి మిరప సాగు చేసిన రైతులు పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్తున్నారు. రోజుకు రూ.15 వేలు పెట్టి ట్యాంకర్లతో మొక్కలకు నీరు కడ్తున్నారు. వారం, పదిరోజులకోసారి ట్యాంకర్లు ద్వారా నీటి తడులు అందిస్తున్నారు. ఇలా చేస్తే రోజుకు ఎకరా, రెండెకరాల వరకు తడుస్తుందని అయినా పంట చేతికోస్తుందో లేదో అని రైతులు దిగాలు చెందుతున్నారు. వర్షాభావం ఒక వైపు, ఎల్లెల్సీలో నీరు పారక మరో వైపు పంటల సాగుకు నోచుకోక మండల రైతులు నిద్ర కరువై దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

18 నుంచి వాల్మీకుల రిలే నిరహారదీక్షలు

ఆలూరు: వాల్మీకి కులస్తులను కేంద్ర ప్రభుత్వం ఎస్టీ జాబితాలోకి చేర్చాలని కోరుతూ ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు రిలే నిరహార దీక్షలు చేపట్టనున్నట్లు జిల్లా వీఆర్పీఎస్ యువజన అధ్యక్షుడు అర్జున్ తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో గురువారం దీక్షకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. త్వరలో విడుదలయ్యే ఎన్నికల నోటిఫికెషన్ నాటికి పార్లమెంట్‌లో వాల్మీకుల ఎస్టీ జాబితా అంశాన్ని తేల్చాలన్నారు. వివిధ గ్రామాలకు చెందిన యువజన నాయకులు ఉన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

చిప్పగిరి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కొండయ్య ప్రజలకు సూచించారు. గురువారం మండలంలోని నగరడోణ గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ పథకాల గురించి వివరించారు. బీజేపీ మండలాధ్యక్షుడు పరందామయ్య, ఈఓపీఆర్డీ బాలన్న, ఏఓ విజయ లక్ష్మి, ఏపీఎం నాగార్జున, సర్పంచ్ మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు జగనన్న తోడు

హాలహర్వి: మండలంలోని జగనన్న తోడు పథకం కింద 338 మంది లబ్ధిదారులకు రూ.33,88,000 మంజూరైనట్లు ఎంపీడీఓ ఆంతోని తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో లబ్ధిదారుల వివరాలను తెలియజేశారు. వడ్డీ లేని రుణాలతో లబ్ధిదారులు ఆర్థికంగా రాణించేలా వ్యాపారాలు చేసుకోవాలన్నారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జమ అయ్యాయన్నారు. ఏపీఎం శివయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు అల్లీపీరస్వాముల ఆరాధనోత్సవం

ఎమ్మిగనూరురూరల్: నందవరం మండలం హలహర్వి గ్రామంలో శుక్రవారం జరిగే శ్రీ సద్గురు అల్లీపీరా, గౌస్ పీరా స్వాముల ఆరాధన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆరాధనోత్సవ కమిటీ సభ్యులు హెచ్ఎండీ రఫీక్, హజరత్‌బిలాల్, ఖాసీం, షేక్షావలి, బి.జయన్న పేర్కొన్నారు. బుధవారం రూరల్ సీఐ సర్కిల్ కార్యాలయంలో సీఐ మోహన్‌రెడ్డికి కమిటీ సభ్యులు ఆరాధనోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కార్యాలయం అవరణలో వారు మాట్లాడుతూ.. నేడు సాయంత్రం శ్రీ గుడేకల్ సద్గురు అల్లీపీరా, గౌస్‌పీరా స్వాముల వారి ఆరాధన మహోత్సవాన్ని ట్రస్టీ అధ్యక్షులు సద్గురు ఘాజీ హుసేన్‌పీరా స్వాముల అధ్యక్షతన జరుగునున్నట్లు చెప్పారు. సభ్యులు బజారి, నల్లన్న, తాయప్ప, మాబు, అంజనయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సలాం


హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో కిడ్నీ ఆపరేషన్ చేయించుకున్న ఆగవేళి వీరప్రకాష్‌కు రూ.10 వేల పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటస్వామి


పోతుగల్లుకు చెందిన బోయ జయమ్మ, సావిత్రి తెలంగాణకు బతుకుదెరువు కోసం వెళ్లగా అక్కడికే వెళ్లి పింఛన్ అందిస్తున్న వలంటీర్ దాసరి మద్దిలేటి

కృష్ణగిరి: సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి దరఖాస్తు చేయించడం, ఆపద సమయాల్లో అండగా నిలవడం, ఒకటో తేదీ తెల్లవారుజామునే అవ్వాతాతల తలుపుతట్టి పింఛను డబ్బు చేతికందించి వారి ఆశీస్సులు పొందడం.. ఇదీ వలంటీర్ల పని. వలంటీర్లతోపాటు సచివాలయ ఉద్యోగులు కూడా ఈ సేవలో పాల్గొని ప్రశంసలు పొందుతున్నారు. వాస్తవానికి వీరు చేస్తున్నది పనికాదు సమాజసేవ. మండల పరిధిలోని ఆగవేళి గ్రామానికి చెందిన తెలుగు వీర ప్రకాష్‌కు హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో కిడ్నీ ఆపరేషన్ జరిగింది. విషయం తెలుసుకున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటస్వామి గురువారం అక్కడికే వెళ్లి పింఛన్ సొమ్ము రూ.10వేలు అందజేయడంతో లబ్ధిదారుడు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే పోతుగల్లు గ్రామానికి చెందిన బోయ జయమ్మ, సావిత్రి బతుకుదేరువు కోసం తెలంగాణలోని మన్నేగూడకు వెళ్లారు. గురువారం వలంటీర్ దాసరి మద్దిలేటి అక్కడికే వెళ్లి వారికి పింఛన్ సొమ్మును అందజేశారు.

ఏబీసీడీ వర్గీకరణకు పోరాటం


మాట్లాడుతున్న ఎమ్మెస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైకే విశ్వనాథ్ మాదిగ

వెల్దుర్తి(కృష్ణగిరి): ఏబీసీడీ వర్గీకరణకు మాదిగలు ఏకమై పోరాటాలు చేయాలని ఎమ్మెస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైకే విశ్వనాథ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు భాస్కర్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం వారి ఆధ్వర్యంలో చేపట్టిన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ వెల్దుర్తి మండల నూతన కమిటీల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. హైవే ప్రక్కనున్న మందిరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసేలా, ప్రభుత్వాలు దిగివచ్చేలా ప్రతి మాదిగ ఇంటి నుంచి గళం వినిపించాలన్నారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా బోయనపల్లె నాయకంటి దేవరాజు, అధికార ప్రతినిధిగా కొసనాపల్లె రోటో సుధాకర్, ఎమ్మెస్పీ మండలాధ్యక్షుడిగా వెల్దుర్తి దేవదానం, ఉపాధ్యక్షుడిగా బింగిదొడ్డి కల్లె ఈరన్న, ఆయా సమితుల మిగితా ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంతకు ముందు స్థానిక పాతబస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెస్పీ జిల్లా కో–కన్వీనర్ ఆంథ్రియ, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌ఛార్జ్ గిడ్డయ్య, కలుగొట్ల సర్పంచ్ మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు


మాళమల్లేశ్వర స్వామి విరాట్‌మూర్తులకు పూజలు చేస్తున్న దృశ్యం

హొళగుంద: మండలంలోని ఆయా ఆలయాలు, దర్గాల్లో గురువారం అమావాస్య పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, ఫాతెహాలు జరిగాయి. దేవరగట్టు క్షేత్రంలో వెలసిన మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో విరాట్ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు మూల విరాట్‌లకు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సంతర్పణ తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామానికి చెందిన నిర్వాహకులు దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. మొక్కులున్న భక్తులు మోకాళ్లపై మెట్లు ఎక్కి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. అదేవిధంగా హొళగుంద సిద్దేశ్వర స్వామి, సాయిబాబా మందిరం, ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాలు, హొళగుంద సాయిబన్న, చిణిగి తాతా దర్గాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, ఫాతెహాలు చేశారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు


నందవరంలో ఫైనల్‌కు చేరుకున్న పెద్దకొత్తిలి కబడ్డీ జట్టుతో అధికారులు


మద్దికెరలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ


హొళగుందలో వాలీబాల్ పోటీలు జరుగుతున్న దృశ్యం


బెల్డోణ గ్రామంలో క్రికెట్ ఆడుతున్న దృశ్యం


ఆస్పరిలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం – ఆంధ్ర' క్రీడాపోటీలు మండలస్థాయిలో రెండవ రోజు హోరాహోరీగా సాగాయి. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కబడ్డీ, క్రికెట్, ఖోఖో పోటీలు రసవత్తరంగా జరిగాయి. కబడ్డీ పోటీల్లో పెద్దకొత్తిలి జట్టు హాలహర్వి–2, సోమలగుడూరు–2తో పోటీపడి ఫైనాల్‌కు చేరుకుంది. ఖోఖోలో నందవరం–2 సచివాలయం జటుట ఫైనల్‌కు చేరుకుంది. క్రీడాపోటీలను ఎంపీడీఓ దశరథరామయ్య పర్యవేక్షించారు. మహిళలకు ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించగా నందవరం సచివాలయం–2 జట్టు గెలుపొందింది. ఫిజికల్ డైరక్టర్లు మహమ్మద్ హనీఫ్, ఈరన్న, పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి, శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెరలో గురువారం మండలస్థాయి క్రీడాపోటీలను ఎంపీడీఓ నరసింహమూర్తి పరిశీలించారు. క్రీడాపోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిభ కనబరిచి ఉన్నతంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఈఓలు సుధాకర్, సంజప్ప, వన్నూరప్ప, అరుణకుమారి, మనోజ్, విజయ్ తదితరులు పర్యవేక్షించారు.

ఆస్పరి: 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా గురువారం ఆస్పరి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో మండల స్థాయి ఖోఖో, వాలీబాల్ పోటీలను ఎంపీడీఓ రాణెమ్మ, ఏంఈఓ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

హొళగుంద: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుతాయని పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, పంపాపతి, కుమారస్వామి అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గురువారం హొళగుందలో ఆటల పోటీలు జరిగాయి. వాలీబాల్, ఖోఖో పోటీల్లో ఆయా జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని ప్రభుత్వం వివిధ స్థాయిలో ఎంపిక చేసి మంచి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తుందని చెప్పారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిప్పగిరి: మండలస్థాయి ఆడుదాం – ఆంధ్ర క్రీడా పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారు. గురువారం మండలంలోని బెల్డోణ గ్రామంలో క్రీడా పోటీలు జరిగాయి. శుక్రవారం క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. క్రీడలను ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్డీ బాలన్న పర్యవేక్షించారు.

అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు

చిప్పగిరి: నిరవధిక సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ సందర్భంగా మండలంలో సమ్మెలో ఉన్న ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల ఇళ్లకు గ్రామాల వీఆర్‌ఏలు నోటీసులు అతికించారు. షోకాజ్ నోటీస్‌లు అందుకున్న 10 రోజుల్లోపు వివరణ ఇవ్వాల్సి ఉంటుందని ఐసీడీయస్ అధికారులు తెలిపారు. లేనిపక్షంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని నోటీసుల్లో పేర్కొన్నారు.

మూలధనం చెల్లించకుంటే సభ్యత్వం రద్దు

మద్దికెర: మండల పరిధిలోని బురుజుల సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న రైతుల మూలధనం రూ.300 కంటే తక్కువగా ఉంటే వారి సభ్యత్వం రద్దు చేయబడుతుందని చైర్మన్ సుబ్బయ్య, సీఈఓ మల్లికార్జున గురువారం తెలిపారు. స్థానిక సొసైటీలో సభ్యుల సమావేశం నిర్వహించారు. సభ్యత్వం లేనియెడల సంఘంలో ఎటువంటి రుణ సదుపాయం, ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ రుణాలు, పరిహారం వంటి పథకాలు వర్తించవన్నారు. కావున 15 రోజులలోపు నగదు చెల్లించి సభ్యత్వాన్ని కొనసాగించుకోవాలని సూచించారు. షేర్‌క్యాపిటల్‌తోపాటు సభ్యులు ఫొటో, ఆధార్ కార్డు, సంఘం ఐడీ కార్డు, పొలం పాసుపుస్తకం అందజేయాలన్నారు.